సాక్షి రంగారెడ్డి

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



కలగానే జూనియర్ కళాశాల!

కొందుర్గులో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. 8లో▸



పేదలకు అండగా సీపీఐ

కార్మికులు, కర్షకులకు అండగా నిలిచి పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి అన్నారు. 8లో▸



పారిశుద్ధ్యం ప్రధానం

పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్పెషల్ ఆఫీసర్స్ చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశించారు. 8లో▸

న్యూస్‌రీల్

12న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా

షాద్‌నగర్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ శివారులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 12న ఉదయం 10 గంటల నుంచి ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ మేళాలో వివిధ పరిశ్రమల వారు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ మేళాకు అర్హులని చెప్పారు.మేళాకు హాజరయ్యే విద్యార్థులు ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు విద్యార్హతకు సంబంధించి ధృవీకరణ పత్రాలను వెంట తీసుకుని రావాలని తెలిపారు.

రోడ్ల అభివృద్ధికి నిధులివ్వండి

మంత్రి కోమటిరెడ్డికి వినతి



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నియోజకవర్గ నాయకులు

చేవెళ్ల: నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డిని చేవెళ్ల నియోజకవర్గ నాయకులు కోరారు. బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీం భరత్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సెక్రటరియేట్‌లో ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. హిమాయత్‌నగర్ నుంచి తంగడపల్లి వయా ముడిమ్యాల, రావులపల్లి, మేడిపల్లి, హిమాయత్‌నగర్, తంగడపల్లి నుంచి ఎల్వర్తి వరకు పొద్దుటూరు, టంగుటూరు రోడ్లు మరమ్మతులు చేయాలని కోరారు.ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, నియోజకవర్గ యువజన సంఘం అధ్యక్షుడు పెంటారెడ్డి, నాయకులు రవీందర్ రెడ్డి తదితరులున్నారు.

రైసు మిల్లుల తనిఖీ



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీటీ రఘునందన్

కద్తాల్: మండల కేంద్రంలోని పలు రైస్ మిల్లును బుధవారం జిల్లా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలను పరిశీలించారు. సీఎంఆర్ క్రింద మిల్లర్లకు ఇచ్చిన ధాన్యాన్ని త్వరగా మిల్లింగ్ చేసి, లెవీ బియ్యాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆలస్యమైతే మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడమే కాకుండా లెవీ అనుమతులను రద్దు చేసేందుకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పెద్ద అంబర్‌పేటకు చెందిన మజ్జిగ లక్ష్మారెడ్డి నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి జారీ చేసిన నియామకపత్రాన్ని బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి లక్ష్మారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పదవి ఇచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పెద్దఅంబర్‌పేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణ, పార్టీ నాయకుల సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కౌన్సిలర్లు రాజేందర్‌ముదిరాజ్, పండుగుల జయశ్రీ, అనురాధ, నాయకులు కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, ఖలీం, శ్రీనివాస్‌గౌడ్, రాజిరెడ్డి, పాష, మంజుల సంజీవ, సత్తార్, రఫిక్ ఆయనకు పెద్దఅంబర్‌పేటలో శుభాకాంక్షలు తెలిపారు.

డిప్యుటేషన్లపై కొరడా

వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు తమకు అనుకూలమైన ప్రాంతాలకు డిపుటేషన్ చేయించుకున్నారు. పల్లెలు వదిలి పట్నంలో స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. దీంతో గ్రామాల్లో మెరుగైన వైద్యం అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. వెంటనే వారిని తమ స్థానాలకు పంపాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.



అడ్డదారుల్లో వచ్చిన వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు

- హైదరాబాద్ జిల్లాలో వంద మందికిపైనే..
- రంగారెడ్డిలో 47 మంది డిపుటేషన్లు రద్దు
- కొందరికి మినహాయింపు ఇవ్వడంపై విమర్శలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న కొంత మంది ఉద్యోగులు అడ్డదారులు తొక్కారు. అడ్డదారుల్లో డిప్యుటేషన్లపై వచ్చి గ్రేటర్ జిల్లాల్లో చేరారు. ఇందుకు కొంత మంది తమకున్న రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకోగా, మరికొంత మంది దీర్ఘకాలిక జబ్బుల(కేన్సర్, హృద్రోగం, కిడ్నీ, కాలేయ ఫెయిల్యూర్)తో పాటు తల్లిదండ్రుల అనారోగ్య సమస్యలను సాకుగా చూపించి అడ్డదారుల్లో వలస వచ్చారు. స్థానికతకు, జోనల్ వ్యవస్థకు విరుద్ధంగా వచ్చి చేరారు. తాత్కాలిక ఆర్డర్లపై వచ్చిన వీరంతా ఏళ్లుగా ఇక్కడే స్థిరపడిపోయారు. ఫలితంగా మారుమూల పల్లెల్లోని పేదలకు కనీస వైద్యసేవలు అందించలేని దుస్థితి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అక్రమాలపై దృష్టిసారించింది. గత ప్రభుత్వ హయాంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సహా వైద్య విధాన పరిషత్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాల్లో వచ్చిన వారిని గుర్తించి, వారిని వాస్తవ పోస్టింగ్‌లకు తిప్పి పంపేందుకు ఏర్పాట్లు చేసింది. సాధారణ ఉద్యోగుల తాత్కాలిక బదిలీలను రద్దు చేసిన వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగ సంఘాల పేరుతో ఏళ్ల తరబడి ఇక్కడే తిష్టవేసిన వారిని కొనసాగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ ఆరోగ్య కేంద్రంలో 14 ఏళ్లుగా డిప్యుటేషన్‌పైనే కొనసాగుతోన్న ఓ సీహెచ్‌ఓను ఇప్పటికీ కదిలించకపోవడాన్ని పరిశీలిస్తే..అధికారుల పక్షపాత ధోరణి ఇట్టే స్పష్టమవుతోంది.

అక్కడ పోస్టింగ్.. ఇక్కడ జీతం!

మారు మూల జిల్లాలు, మండలాల్లో పోస్టింగ్‌లు పొందిన వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు, హెల్త్ ఎడ్యుకేటర్స్, పీహెచ్‌ఎన్‌లు, సీహెచ్‌ఓలు, పీఎంఓఓలు ఆ తర్వాత వివిధ కారణాలను సాకుగా చూపించి, ప్రజాప్రతినిధుల సిఫార్సులతో డిప్యూటేషన్లపై గ్రేటర్ జిల్లాలకు చేరుకున్నారు. వీరిలో కొంత మంది ఏడాది కాలానికి, మరికొంత మంది ఆరు నెలల కాలానికి వచ్చారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బోధనాసుపత్రుల్లో ఇలా వచ్చిన వారు సుమారు నాలుగు వేల మంది వరకు ఉన్నట్లు అంచనా. వీరిలో కేవలం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ విభాగంలోనే వెయ్యి మంది ఉన్నట్లు సమచారం. వీరంతా పల్లెల్లో పోస్టింగ్‌లు పొంది..స్థానికతకు విరుద్ధంగా పట్టణానికి చేరుకుని, ఇక్కడే జీతాలు తీసుకుంటుడడం విశేషం. ఇదిలా ఉంటే ఓరల్ డిప్యుటేషన్‌పై సెతం మరికొంత మంది ఉన్నట్లు తెలిసింది. వీరంతా వారికి కేటాయించిన ఆరోగ్య కేంద్రాల్లో కాకుండా నగరానికి ఆనుకుని.. వారి ఇంటికి సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్నట్లు తెలిసింది.

సర్వీసు లిస్టులో మృతురాలి పేరు

వైద్య ఆరోగ్యశాఖ జారీ చేసిన డిప్యూటేషన్ల రద్దు జాబితాలోనూ పలు తప్పిదాలు వెలుగు చూశాయి. ఉద్యోగుల గుర్తింపులో అధికారుల నిర్లక్ష్యానికి ఇది ఒక నిదర్శనం. జాబితాలోని క్రమ సంఖ్య 246లోని స్వరూపారాణి(పీహెచ్ఎన్) వికారాబాద్ నుంచి సూర్యాపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఆమె మూడు నెలల క్రితమే హత్యకు గురైంది. డెత్ సర్టిఫికెట్ సైతం జారీ చేశారు. అయితే ఆమె ఇప్పటికీ సర్వీసులోనే ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ పేర్కొంది. డిప్యుటేషన్ల రద్దు జాబితాలో మృతురాలి పేరును చేర్చడం కొసమెరుపు. జాబితాను రూపొందించడంలో అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో చెప్పడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది.

రిలీవ్.. ఆ వెంటనే జాయినింగ్ రిపోర్టు

తెలంగాణ వ్యాప్తంగా ఏడాది కాలం డిప్యుటేషన్ గడువు ముగిసిన వారు 416 మంది ఉద్యోగులు ఉండగా, వీరిలో ఒక్క హైదరాబాద్ జిల్లా పరిధిలోనే వంద మందికిపైగా ఉన్నన్నట్లు తేలింది. ఇక రంగారెడ్డి జిల్లాలో 47 మంది, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో మరో 30 మంది వరకు ఉన్నారు. అడ్డదారుల్లో వచ్చిన వారందరినీ తిప్పి సొంత గ్రామానికి పంపాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. తక్షణమే వీరందరినీ రిలీవ్ చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించింది. గురువారం సాయంత్రంలోగా ఆయా ఉద్యోగులంతా సొంత పోస్టింగ్‌కు వెళ్లి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం రూ.లక్షలు ఖర్చు చేసి, రాజధానిలోనే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న వారు ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆందోళన చెందుతున్నారు. కనీసం ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడాన్ని వారంతా జీర్ణించుకోలేక పోతున్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

‘పది’లో వందశాతం సాధించాలి

- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి
- విద్యార్థి ఫెయిల్ అయితే ఉపాధ్యాయుడికే అవమానం
- సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పదో తరగతి పరీక్షల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గతేడాది కంటే అత్యుత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రధానోపాధ్యాయులు పని చేయాలన్నారు. విద్యార్థులు 10వ తరగతిలో పాస్ అయితేనే జీవితంలో మెరుగైన స్థితిలో ముందుకు సాగుతారని తెలిపారు. గతంలో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో వనరులు మెరుగుపడ్డాయని, విద్యార్థులు ఎంత వెనకబడి ఉన్నా మెరుగైన శిక్షణ ఇస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలగుతారన్నారు. వందకు వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని, ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించకుంటే మన బోధన లోపమేనన్నారు. గత ఫలితాలను దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రయత్నించాలని సూచించారు. గురువులకు తన శిష్యుడు ఉన్నత స్థానానికి వెళితే ఎంత గౌరవంగా భావిస్తారో... ఫెయిల్ అయినా అంతే అవమానంగా భావించాలన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలన్నారు. విద్యార్థులు ఎక్కువగా మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లోనే వెనుకబడి ఉన్నారని, అలాంటి వారిపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే ఫలితం ఉంటుందని చెప్పారు. స్లిప్ టెస్టులు, మాక్ టెస్టులు నిర్వహించి వాటిపై రివిజన్ చేస్తే విద్యార్థులకు పరీక్షల భయం పోతుందన్నారు. ఎక్కువగా ప్రాక్టీస్ చేసేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల వెనుకబాటుపై చర్చించి వారికి సూచనలు చేయాలన్నారు. అనంతరం విద్యశాఖ అధికారి సుశీందర్ రావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సి-గ్రేడ్ విద్యార్థులను గుర్తించి ఐదుగురు విద్యార్థులను ఒక బృందం చేసి మెరుగైన సూచనలు చేసి, పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. పరీక్షలు జరిగే వరకు పాఠశాలలో ఎలాంటి కల్చరల్ యాక్టివిటీస్ లాంటివి నిర్వహించకుండా, విద్యార్థులచే ప్రతీ సబ్జెక్టును ప్రాక్టీస్ చేయించి పట్టు సాధించి ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని తెలిపారు. ఉపాధ్యాయులు, ప్రధాన ఉపాధ్యాయులు సమష్టిగా పని చేస్తే పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, ప్రధాన ఉపాధ్యాయులు, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌ను ఆధునీకరిస్తాం

సౌత్ సెంట్రల్ రైల్వే జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు కాశీనాథ్



శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించిన కాశీనాథ్

శంకర్‌పల్లి: మౌలిక వసతులు కల్పించి శంకర్‌పల్లి రైల్వేస్టేషన్‌ను ఉన్నతీకరిస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే జెడ్ఆర్‌యూఈసీసీ (జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ) సభ్యుడు కాశీనాథ్ అన్నారు. బుధవారం ఆయన శంకర్‌పల్లి స్టేషన్ నుంచి తిరువణమలై (అరుణాచలం)కు ప్రత్యేక రైలులో వెళ్తున్న భక్తులతో మాట్లాడారు. సంగారెడ్డికి చెందిన మహేశ్వర సిద్ధాంతి, జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో 1,152 మంది భక్తులు తరలివెళ్లారు. అనంతరం ఆయన స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో కవరింగ్ ప్లాట్‌ఫామ్ లేకపోవడంతో ప్రయాణికులను తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. రైల్వే స్టేషన్‌కు ప్రహరీతో పాటు పలు మౌలిక వసతులు అవసరమని గుర్తించామని చెప్పారు. స్టేషన్‌లో ప్రయాణికుల కోసం ప్రత్యేక ఫుడ్ కోర్టులతో పాటు తాగునీటి సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. లిఫ్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఉన్నత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ మేనేజర్ బుచ్చిరెడ్డి, చీఫ్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ మధుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

హాజిపల్లి అభివృద్ధి ఆదర్శనీయం

ఎన్ఐఆర్‌డీ బృందం



హాజిపల్లిని సందర్శించిన ఎన్ఐఆర్‌డీ బృందం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి గ్రామాన్ని బుధవారం ఎన్ఐఆర్‌డీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్) బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలోని సీసీ రోడ్లు, యూజీడీ, డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక, నర్సరీ, పల్లె ప్రకృతివనం తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎన్ఐఆర్‌డీ బృందం సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు భేషుగ్గా ఉన్నాయని కితాబిచ్చారు. హాజిపల్లి అభివృద్ధిని ఆదర్శంగా తీసుకుని తమ ప్రాంతాలలో ప్రగతి పనులను చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తామని అన్నారు.



దొడ్లపహాడ్‌లో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

సాగుకు సరిపడా యూరియా

జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

మాడ్గుల: జిల్లాలో రైతులు పంటలు సాగు చేసుకోవడానికి సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. బుధవారం ఆమె మండల పరిధిలోని దొడ్లపహాడ్ గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సాగు వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పంటలలో చీడపీడల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు తమ పంటలను వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలతో సాగు చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరకే యూరియా కొనుగోలు చేయాలని తెలిపారు. ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయించినా, నకిలీ విత్తనాలు విక్రయించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల దుకాణాల డీలర్లు నిల్వలను ఎప్పటికప్పుడు ఈ పాస్ లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల మండల వ్యవసాయాధికారి గౌతమ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల దశ తిరిగేలా.. స్వచ్ఛత మెరిసేలా

- గ్రామాల అభివృద్ధిపై నజర్
- ఈ నెల 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు
- పనితీరు ఆధారంగా ఉత్తమ పంచాయతీల ఎంపిక



ఎలికట్టలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రారంభిస్తున్న అధికారులు

జిల్లా సమాచారం

మండలాలు	21
పంచాయతీలు	588
వార్డులు	5,564

షాద్‌నగర్: సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. ప్రభుత్వం పంచాయతీల వారీగా ప్రత్యేకాధికారులను నియమించింది. గ్రామాలను స్వచ్ఛతవైపు నడిపించి ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. గ్రామాభివృద్ధి పనులతోపాటుగా, మౌలిక వసతుల కల్పన వంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బుధవారం నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలను ప్రారంభించారు.

15 వరకు వారోత్సవాలు

ఈ నెల 15 వరకు గ్రామాల్లో అధికారులు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి రోజువారీగా చేపట్టే కార్యక్రమాలను రూపొందించి ఆయా సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటుగా ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలనే ప్రధాన లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు.

సమష్టి భాగస్వామ్యం

15వ ఆర్థిక సంఘం నిధులతో అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ వారోత్సవాల్లో యువత, మహిళా స్వయం సహాయక సంఘాలతో పాటుగా, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఉత్తమ పంచాయతీలకు అవార్డులు

పారిశుద్ధ్య కార్యక్రమాల చివరి రోజు పండుగ వాతావరణలో ముగింపు కార్యక్రమాలు చేపట్టనున్నారు. గ్రామ సభలు నిర్వహించి చేపట్టిన కార్యక్రమాలపై అధికారులు సమీక్షించనున్నారు. మద్యపాన,ం మత్తు పదార్థాలు, గుట్కా వంటి వాటికి యువతను దూరంగా ఉంచేలా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పనితీరు అధారంగా జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి ఉత్తమ పనితీరు కనబర్చిన కార్మికులు, గ్రామ పంచాయతీలకు కలెక్టర్ ఆధ్వర్యంలో అవార్డులు అందజేస్తారు.

కార్యక్రమ విధానం

- ♦ రోజూ రహదారుల శుభ్రం చేయడం, మురుగు కాల్వల్లో పూడిక తీయడం, గుంతల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి.
- ♦ గ్రామ పంచాయతీలోని అన్ని వీధుల్లో గుంతలు పూడ్చడం.
- ♦ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్ స్థలాలు, బస్‌స్టాండ్‌లు, అన్ని ప్రభుత్వ స్థలాలను ఎప్పటిప్పుడు శుభ్రం చేయాలి.
- ♦ ఖాళీగా ఉన్న ప్లాట్లు శుభ్రం చేయడం, శిథిలావస్థకు చేరిన ఇళ్లు భవనాలను తొలగించడం, పాడుబడిన బావులు పూడ్చివేయడం, ఉపయోగంలో లేని బోరు బావులను గుర్తించి మూసివేయడం.
- ♦ మురుగు కాల్వల్లో, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం, యాంటీ లార్వా రసాయనాలు, వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్.
- ♦ గ్రామ పంచాయతీ పరిధిలోని ఇళ్లల్లో శుక్రవారం డ్రైడేగా పాటించాలి.

అందరు భాగస్వామ్యం కావాలి

పల్లెల అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యులవ్వాలి. గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టేందుకు చర్యలు చేపట్టాం. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.

– శ్రీనివాస్‌రెడ్డి, డీపీఓ

పురుషుడి మెడలో చైన్ స్నాచింగ్

కళ్లలో కారం చల్లి బంగారు గొలును చోరీ

హస్తినాపురం: మహిళలే లక్ష్యంగా గతంలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన దొంగలు..బుధవారం ఓ పురుషుడి కళ్లలో కారం చల్లి.. అతడి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన వనస్థలిపురం పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సాహెబ్‌నగర్ పరిధిలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన బండారి గోవర్ధన్ (43) కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు రవీంద్ర భారతి స్కూల్ సమీపంలో పాల ప్యాకెట్ తీసుకుని వీరాంజనేయ కాలనీ నుంచి నడుచుకుంటూ తన ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యలో గోవర్ధన్ కదలికలను కనిపెట్టిన అగంతకులు అతడి కళ్లలో కారం చల్లి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును తెంచుకుని పారిపోతుండగా అప్రమత్తమైన బాధితుడు వారిని పట్టుకునేందుకు వెంబడించారు. ఇద్దరు దొంగల్లో ఒకడు ద్విచక్రవాహనం తీసుకుని సామానగర్ వైపు పారిపోగా మరొకడు వీరాంజనేయ కాలనీ వైపు పరుగెత్తాడు.అప్పటికే గోవర్ధన్ తన కిరాణా దుకాణం వద్ద పార్క్ చేసిన బైక్‌పై వారిని పట్టుకునేందుకు యత్నించినా ఫలితం దక్కలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు అండగా సీపీఐ



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి

పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: కార్మికులు, కర్షకులకు ఎప్పుడూ అండగా నిలిచి పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి పేర్కొన్నారు. మండలంలోని కందవాడలో బుధవారం గ్రామ కమిటీ అధ్యక్షుడు బల్వంత్‌రెడ్డి అధ్యక్షతన సీపీఐ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. రోజురోజుకు ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుందని భవిష్యత్‌లో మోదీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం అప్పుల పాలు చేసిందని, లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిందన్నారు. సీపీఐ పార్టీని గ్రామాల్లో బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కందవాడ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కార్యదర్శిగా ఎలిషా, సహాయ కార్యదర్శులుగా యాదమ్మ, ఎర్ర బీరప్ప, సత్తయ్య, బాలరాజు సభ్యులుగా లతా, రాములమ్మ, ఎర్ర యాదయ్య, రామచంద్రయ్య, వినోద్, ఎర్ర గోపాల్, మల్లేశ్, బుచ్చయ్య, భాగ్యమ్మ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సత్తిరెడ్డి, ఎండీ మక్బుల్, శౌరీలు, మంజుల, వెంకటమ్మ, లలిత, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలగానే జూనియర్ కళాశాల!

- ఇంటర్ విద్యకు విద్యార్థులు దూరం
- హామీలకే పరిమితమవుతున్న నేతలు
- ఏర్పాటు చేయాలంటున్న కొందుర్గువాసులు

కొందుర్గు: ప్రభుత్వాలు మారినా పాలకుల తీరు మారడం లేదు. కొందుర్గులో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని చాలా కాలంగా మండల వాసులు అభ్యర్థిస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. జూనియర్ కళాశాల ఏర్పాటుతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఉద్యమకాలంలో స్థానికులు ఆశించారు. కానీ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావస్తున్నా కొందుర్గు రాత మారడం లేదని వాపోతున్నారు. 2018లో కొందుర్గు గ్రామానికి చెందిన పెరుమాళ్ల చంద్రశేఖర్ నిరాహారదీక్ష చేపట్టారు.



కొందుర్గులో జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం దీక్ష చేపట్టిన యువకులు (ఫైల్)

అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు దీక్షకు మద్దతునిచ్చాయి. అప్పట్లో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హామీ మేరకు ఆయన దీక్ష విరమించారు. అనంతరం కళాశాల ఏర్పాటు కోసం కార్పస్ ఫండ్ కింద రూ.3.15 లక్షలు చెల్లించాలని సూచించడంతో మండల కేంద్రంలోనే దాదాపు రూ.86 వేలు విరాళాలు సేకరించారు. అయినా నేటికీ కళాశాల ఏర్పాటు కాలేదు.

ఉన్నత చదువులకు దూరం

కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు సంబంధించి 46 గ్రామ పంచాయతీలకు గాను రెండు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు, రెండు గురుకుల పాఠశాలలతోపాటు ఆరు ఉన్నత పాఠశాలలు, 15 ప్రాథమికోన్నత, 49 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. 4 ప్రైవేటు పాఠశాలలు సైతం ఉన్నాయి. వీటిలో పదో తరగతి పూర్తిచేసి ఏటా దాదాపు 400 మంది వరకు జూనియర్ కళాశాలలో ఉన్నత చదువుల కోసం వెళుతున్నారు. కానీ అందుబాటులో కళాశాల లేకపోవడంతో షాద్‌నగర్, మొగిలిగిద్ద, పరిగి, మహబూబ్‌నగర్ పట్టణాలను ఆశ్రయిస్తున్నారు. ఇక ఆర్థిక స్థోమత లేనివారు అర్ధాంతరంగా చదువు మానేస్తున్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఒక్క కళాశాలా లేదు



కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ రెండు మండలాల్లో కలిసి ఒక్క జూనియర్ కళాశాల లేకపోవడం చాలా బాధాకరం. గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా స్థాయి పెంచుతున్నామని గత ప్రభుత్వం దాటవేసింది. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమయినా కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– తొండపల్లి దర్శన్, బీఎస్పీ నాయకుడు

ఏర్పాటుకు కృషి చేస్తా



కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో జూనియర్ కళాశాల లేకపోవడంతో గ్రామీణ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కావడం బాధాకరం. ఆయా మండలాల్లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడానికి కృషి చేస్తా.

– వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్ ఎమ్మెల్యే

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



శ్రీను మృతదేహం

షాబాద్: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్ గ్రామంలో చోటుచేసుకుంది. షాబాద్ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇడిగా శ్రీను(30) గ్రామంలో బజ్జీల బండి నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వచ్చి గ్రామ సమీపంలోని వ్యవసాయ ఆవరణలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి మృతికి సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో తల్లి మృతి

తలకొరివి పెట్టిన కూతురు

నందిగామ: గతేడాది అనారోగ్యంతో తండ్రి చనిపోయాడు. నేడు తల్లి సైతం మృతి చెందింది. ఆ దంపతులకు ఉన్న ఇద్దరు కూతుళ్లలో ఒకరికి వివాహం అవ్వగా చిన్న కూతురు తల్లి వద్దే ఉంటోంది. తల్లి మరణంతో ఆ చిన్నారి గుండెలవిసేలా రోదించింది. తలకొరివి సైతం చిన్న కూతురే పెట్టింది. హృదయ విదారక సంఘటన మండల కేంద్రమైన నందిగామలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. నందిగామకు చెందిన ఏకుల శంకరమ్మ, ఎల్లయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంటారు. ఎల్లయ్య తన పెద్ద కూతురికి వివాహం చేశారు. గతేడాది ఆయన అనారోగ్యానికి గురై మృతి చెందారు. దీంతో శంకరమ్మ చిన్న కూతురు రాధికతో కలిసి ఉంటోంది. ఆమె దినసరి కూలీ పనులు చేస్తుండగా రాధిక కుట్టు మిషన్‌తో చేదోడు వాదోడుగా ఉంటోంది. ఈ నేపథ్యంలో శంకరమ్మ ఇటీవల అనారోగ్యానికి గురైంది. మంగళవారం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న బంధుమిత్రులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సూర్యాపేటను సందర్శించిన షాద్‌నగర్ కౌన్సిల్ సభ్యులు

షాద్‌నగర్: షాద్‌నగర్ మున్సిపాలిటీ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు బుధవారం సూర్యాపేటను సందర్శించారు. అక్కడ డంపింగ్ యార్డు, మురుగు నీటి శుద్ధి కేంద్రం, తడి చెత్తతో ఎరువులు తయారు చేసే కేంద్రాలను పాలక మండలి సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేందర్ మాట్లాడుతూ.. సూర్యాపేట తరహాలో షాద్‌నగర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు పావని, కౌసల్య,



ఎరువుల తయారీని పరిశీలిస్తున్న షాద్‌నగర్ మున్సిపాలిటీ పాలక మండలి సభ్యులు

శ్రీనివాస్, లతా శ్రీ,శ్రీనివాస్‌గౌడ్, ఈశ్వర్‌రాజు, ప్రతాప్‌రెడ్డి, శారద, అంతయ్య, నర్సింహ, మానస, ప్రేమలత, మహేశ్వరి, శ్రీనివాస్, సరిత, విశాల, నందీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ చోరీ

తలకొండపల్లి: మండల పరిధిలోని మల్లప్ప గుట్ట ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీ చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దుండగులు హుండీని అపహరించారు. గేటు తాళం పగులగొట్టి ఆలయంలోకి చొరబడి హుండీని ధ్వంసం చేశారు. అందులోని రూ.5,000 నగదును దోచుకున్నారు. ఆలయ నిర్వాహకుడు పెంటారెడ్డి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పల్లెల్లో పారిశుద్ధ్యం ప్రధానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ల సమావేశం

ఇబ్రహీంపట్నం: పల్లెలన్నీ పరిశుభ్రంగా ఉండాలని.. అందుకు స్పెషల్ ఆఫీసర్స్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశించారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా నియోజకవర్గంలోని గ్రామ స్పెషల్ ఆఫీసర్లకు సమావేశాన్ని బుధవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పలు గ్రామాల ముఖద్వారం వద్దనే ముళ్ల చెట్లు, చెత్తాచెదారం, మురికి పేరుకుపోయి దుర్వాసన వస్తుందన్నారు. అలాంటి గ్రామాల పరిస్థితులను పూర్తిగా మార్చి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాల భవనాలకు రంగులు వేసి పరిశుభ్ర వాతావరణాన్ని విద్యార్థులకు కల్పించాలన్నారు. సర్పంచ్‌లు లేని లోటును స్పెషలాఫీసర్లు తీర్చాలన్నారు. రాజకీయాలకు పక్కకు పెట్టి గ్రామాభివృద్ధిలో ప్రజలు, వివిధ రాజకీయ పక్షాలు భాగస్వాములు కావాలన్నారు. ఈ నెల 15న సన్మాన కార్యక్రమాలను నిర్వహించి అవార్డులను అందజేస్తామన్నారు.

రూ.10 కోట్లు మంజూరు

గ్రామాలల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని.. ఈ నెల చివరిలోగా నీటి సమస్యలున్న ప్రాంతాలను గుర్తించి జాబితాను ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకొని నీటి కోటాను పెంచి, సక్రమంగా సరఫరా చేయాలన్నారు. గ్రామాలాభివృద్ధికి రూ.పది కోట్లను తాను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. లూజ్ లైన్లను సరిచేసి వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌రావును ఆదేశించారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం, యాచారం ఎంపీపీలు కృపేశ్, కొప్పు సుకన్య, అడిషనల్ డీఆర్‌డీఏ పీడీ నీరజా, ఎంపీడీలు శ్రీనివాస్, వెంకటమ్మ, తహసీల్దార్ అన్వర్‌తోపాటు నియోజకవర్గ స్పెషలాఫీసర్లు, అధికారులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ సీఐగా సైదయ్య



అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ సీఐగా సైదయ్యను నియమిస్తూ రాచకొండ సీపీ సుధీర్ బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ మన్మోహన్‌ను స్పెషల్ బ్రాంచికి బదిలీ చేశారు.

కళ్లల్లో కారం చల్లి గొలుసు కాజేసిన మహిళ అరెస్ట్



నిందితురాలు పుల్లమ్మ

మల్కాజిగిరి: ఇంట్లోకి వచ్చిన ఓ మహిళ మాయమాటలు చెబుతూ గొలుసు కాజేసిన సంఘటనలో ఆమెను మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ తెలిపిన మేరకు...మల్కాజిగిరి మీర్జాలగూడలో నివాసముంటున్న రాధిక ఇంటికి ఈ నెల 6న ఓ గుర్తు తెలియని మహిళ వచ్చి మంచినీళ్లు కావాలని మాటలు కలిపింది. అదును చూసి ఆమె మొఖంపై కారంపొడి చల్లి మూడు తులాల బంగారు గొలుసుతో పారిపోయింది. దీనిపై ఫిర్యాదు చేయడంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు సీసీ ఫుటేజీల ద్వారా దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఉన్న మహిళను అదుపులోకి తీసుకొని విచారించడంతో నేరం ఒప్పుకుంది. కృష్ణా జిల్లా నందిగామకు చెందిన పుల్లమ్మ(45)గా తన పేరు చెప్పిందని ఆమె వద్ద నుంచి గొలుసు స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించామని సీఐ తెలిపారు.

తట్టేపల్లిలో 'కొండా' సందడి



స్థానికులు, కార్యకర్తలతో సమావేశమైన విశ్వేశ్వర్‌రెడ్డి

'గావ్ చలో' మోదీ పిలుపులో భాగంగా మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బుధవారం పెద్దేముల్ మండలం తట్టేపల్లిలో పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులను కలిసి మాటామంతీ నిర్వహించారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మోదీని హ్యాట్రిక్ ప్రధానిగా చేసేందుకు ప్రతిఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు, గ్రామస్తులు ఆయన్ను శాలువా, పూలమాలలతో సన్మానించారు. – తాండూరు

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఇబ్రహీంపట్నం: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలిమినేడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ ప్రకారం.. గ్రామానికి చెందిన మహేందర్ చారి తన ఇంటికి తాళం వేసి మంగళవారం కుంట్లూరుకు వెళ్లారు. మరుసటి రోజు వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం యథావిధిగా ఉన్నా.. లోపలికి వెళ్లి చూసే సరికి అల్మారా తీసి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అందులో అర తులం బంగారం, 40 వేలు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

సర్పంచుల హయాంలోనే అభివృద్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి
ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: పదవికే విరమణ తప్పా ప్రజాసేవకు కాదని జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి ,ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశపుహాల్‌లో ఎంపీపీ మంద జ్యోతిపాండు, ఎంపీడీఓ వెంకట్రాములు ఆధ్వర్యంలో ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న మండల పరిధిలోని సర్పంచులకు వీడ్కోలు సభ నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. కరోనా కాలంలో సైతం ప్రాణాలను పణంగా పెట్టి గ్రామాల్లో ప్రజలకు సేవలందించారని కొనియాడారు. కేసీఆర్ సంకల్పంతో సర్పంచుల హయాంలో జరిగిన పల్లె ప్రగతి పనులు, అభివృద్ధి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అందరూ ఎంతో బాధ్యతగా తమ విధులను నిర్వహించారన్నారు. హరితహారంలో భాగంగా మొక్కలు



సర్పంచులను సన్మానించిన అనితారెడ్డి, సబితారెడ్డి తదితరులు

విరివిగా నాటి హరిత విప్లవానికి నాంది పలికారన్నారు. ఇదంతా సర్పంచుల కృషితోనే సాధ్యమైయిందన్నారు. అనంతరం మాజీ సర్పంచులను ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, మాజీ ఎంపీపీ పెద్ద రామయ్య, ఎంపీటీసీలు ఎల్మటి లక్ష్మీ, ఇందిర, రాజమ్మ, రాజశేఖర్‌రెడ్డి, రాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొట్టారు.. తిట్టారు!

- అనురాగ్ యూనివర్సిటీలో విద్యార్థి ఆత్మహత్యాయత్నం
- అధ్యాపకుల వేధింపులే కారణమన్న కుటుంబీకులు
- గోప్యంగా ఉంచేందుకు యత్నించిన యాజమాన్యం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్ఞానేశ్వర్‌రెడ్డి

పోచారం: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం ఓ విద్యార్థి ఆత్మహత్యా యత్నానికి పాల్పడటం కలకలం రేపింది. అధ్యాపకుల వేధింపుల కారణంగానే విద్యార్థి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి బంధువుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామానికి చెందిన నక్కిరెడ్డి జ్ఞానేశ్వర్‌రెడ్డి ఇక్కడి అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ (సీఎస్‌ఈ) మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నాలుగు రోజుల క్రితం వచ్చిన మొదటి సెమిస్టర్ ఫలితాల్లో నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో జ్ఞానేశ్వర్ ఒత్తిడికి గురై ఆందోళన చెందుతున్నట్లు తోటి విద్యార్థులు గమనించారు. ఇదిలా ఉండగా.. హెయిర్ కటింగ్ చేయించుకోలేదని జ్ఞానేశ్వర్‌ను డీన్ శ్రీనివాసరావుతో పాటు ఫిజికల్ ట్రైనర్ మంగళవారం అందరి ముందు అవమానించడంతో పాటు కొట్టారు. ఇదే విషయాన్ని జ్ఞానేశ్వర్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి బాధను వ్యక్తం చేశాడు. రెండు రోజుల్లో యూనివర్సిటీకి వచ్చి యాజమాన్యంతో మాట్లాడతామని నచ్చచెప్పారు. కానీ.. తనకు జరిగిన అవమానం తట్టుకోలేని జ్ఞానేశ్వర్ బుధవారం మధ్యాహ్నం యూనివర్సిటీలోని సీ బ్లాక్ రెండో ఫ్లోర్ నుంచి దూకి ఆత్మహత్యా యత్నం చేశాడు. చికిత్స నిమిత్తం అతడిని యూనివర్సిటీకి చెందిన నీలిమ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి పక్కటెముకలు విరిగినట్లు చెప్పారు. విద్యార్థి ఆత్మహత్యా యత్నాన్ని గోప్యంగా ఉంచేందుకు యూనివర్సిటీ యాజమాన్యం ప్రయత్నించడం పలు అనుమానాలకు తావిస్తోంది. పరిస్థితి విషమించే తరుణంలో సంఘటన గురించి యాజమాన్యం చెప్పడంతో కుటుంబ సభ్యులు అదేరోజు సాయంత్రానికే ఆస్పత్రికి చేరుకున్నారు. మొదటి సెమిస్టర్‌లో ఫెయిల్ అయ్యావని, కళాశాలకు క్రమం తప్పకుండా రావడంలేదని, వచ్చినా ఆలస్యంగా వస్తున్నావని ఏదో ఒక కారణం చూపించి వేధించడంతో జ్ఞానేశ్వర్ తట్టుకోలేక ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు జ్ఞానేశ్వర్ బంధువులు ఆరోపించారు. విద్యార్థులను అవమానించి, శారీరకంగా హింసించే హక్కు మీకు ఎవరిచ్చారని అధ్యాపకులను నిలదీశారు. ఆత్మహత్యా యత్నానికి కారకులైన అధ్యాపకులతో పాటు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని జ్ఞానేశ్వర్ అన్న సాత్విక్‌రెడ్డి పోచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. జ్ఞానేశ్వర్‌ను తాము కొట్టలేదని డీన్ శ్రీనివాసరావు వివరణ ఇచ్చారు. దేవుడి మొక్కు ఉందని చెప్పడంతో హెయిర్ కటింగ్ చేయించుకోమని ఒత్తిడి చేయలేదని ఆయన స్పష్టం చేశారు.